

రూ.25 లక్షలకు 'ఆరోగ్యశ్రీ' పరిమితి సరే..

పెండింగ్ బిల్లులేవి..?

ఉమ్మడి జిల్లాలో రూ.140 కోట్లు పైమాటే..
వైద్యం అందించలేమంటున్న నెట్‌వర్క్ ఆస్పత్రులు
ఇచ్చినపుడే తీసుకోవాలంటూ 'ప్రభుత్వ' హుకుం



ప్రజాశక్తి - తిరుపతి

'చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ వైద్య రంగం స్వరూపాన్నే మార్చేశాం.. దేశంలో ఎక్కడా లేని విదంగా ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స వ్యయం పరిమితిని ఏకంగా రూ.5 లక్షల నుంచి 25 లక్షలకు పెంచుతూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాం.' అంటూ ఇటీవలే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటనలు చేశారు.. సిఎం స్థాయి నుంచి కిందిస్థాయి ప్రజాప్రతినిధుల వరకూ ఆరోగ్యశ్రీ పరిమితి పెంచడాన్ని సభల్లో వల్లెవేశారు. అయితే క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తుండటం గమనార్హం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నెట్వర్క్ ఆసుప త్రులకు ఇవ్వాల్సిన రూ 140 కోట్లను నెలల తరబడి ఇవ్వక పోవడంతో బాధితులకు వైద్య సేవలు అందించడానికి విముఖత వ్యక్తం చేస్తుండటం శోచనీయం.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 38 నెట్వర్క్ ఆరోగ్యశ్రీ ఆసుపత్రులు ఉన్నాయి. వీటిలో ఆరోగ్యశ్రీ తో పాటు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌ల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. అయితే గత తొమ్మిది నెలలుగా పెండింగ్ బకాయిలు 140 కోట్లకు పైగా పేరుకు పోయినట్లు తెలుస్తోంది.

కేంద్ర నిధులే దిక్కా..!

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ సక్రమంగా నిధులు విడుదల చేసిన దాఖలాలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం అమలు చేసే ఆయుష్మాన్ భారత్ నిధులే ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు పెద్ద అండగా నిలుస్తున్నాయని తెలుస్తోంది. నెట్‌వర్క్ ఆస్పత్రుల బకాయిలకు ఆయుష్మాన్ భారత్ నిధులనే వాడుతున్నారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇటీవల కాలంలో ఆరోగ్యశ్రీకి రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడము లేదని సమాచారం. ఆరోగ్యశ్రీ ట్రస్టుకు, ఆయుష్మాన్ భారత్‌కు మధ్య నిధుల విషయంలో కొంత గందరగోళం ఏర్పడినట్లు తెలుస్తోంది. ట్రస్ట్‌లోని ఆర్థిక విభాగం ఆయుష్మాన్ భారత్‌కు ఇవ్వాల్సిన సమాచారాన్ని ఇవ్వకుండానే నిధులు విడుదల చేయాలని కోరింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన నేషనల్ హెల్త్ ఏజెన్సీ (ఎన్‌హెచ్‌ఏ) ముందు తాము అడిగిన సమాచారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి గట్టిగా చెప్పినా ప్రయోజనం లేదన్న విమర్శ లున్నాయి..

ఈహెచ్‌ఎస్' డబ్ల్యుజే హెచేస్ పరిస్థితి మరీ దారుణం

రాష్ట్రంలో ఉద్యోగుల ఆరోగ్య భద్రత పథకం (ఈహెచ్‌ఎస్) , వర్కింగ్ జర్నిస్టుల హెల్త్ స్కీమ్ ల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలో ఉన్న ఆస్పత్రులు ఈహెచ్‌ఎస్ అంటేనే వణికిపోతున్నాయి. వీటికి సంబంధించి ప్రతినెలా రూ.70 నుంచి రూ.80 లక్షల విలువైన బిల్లులు వస్తాయి. ఆ మాత్రం బిల్లులను కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందా ? అంటూ తిరుపతి రెడ్డిరెడ్డి కాలనీకి చెందిన ఓ ప్రముఖ వైద్యుడు ప్రశ్నిస్తుండటం గమనార్హం. ఇలాగైతే తాము సిబ్బందికి జీతాలూ ఇవ్వలేని పరిస్థితుల్లో వున్నామని, అధికారులేమో ప్రభుత్వం ఇచ్చేదాక నోరుమెదపకండి అంటూ హుకుం జారీ చేయడం దారుణమని వాపోతుండటం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగులు, జర్నలిస్టులు తమ జేబుల్లో నుంచి డబ్బులు ఖర్చు పెట్టుకుని ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజాగా తిరుపతికి చెందిన ఓ జర్నలిస్టు పంటి చికిత్స కోసం ఓ ప్రముఖ నెట్వర్క్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయమంటే ' మాకు మీ జర్నలిస్ట్ స్కీమ్ బిల్లు పడటం లేదు...అందుకే మీకు చికిత్స చేయలేం' అంటూ తిప్పి పంపడం శోచనీయం.

జీతాలు పెంచాల్సిందే..

3న కలెక్టరేట్ ముట్టడికి సిద్ధం అవుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అంగన్వాడీలు జీతాలపెంపు, గ్రాట్యూటీ అమలు చేయకుంటే ఈనెల 3వ తేదీ కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని అంగన్వాడీ యూనియన్ నేతలు సృజని, బుజ్జి, ప్రేమ, ప్రభావతిలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడీల పోరాటానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు మద్దతు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు, మినీ అంగన్వాడీ వర్కర్ల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ, సిఐటియు, ఐఎఫ్టియు నాయకత్వంలో చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారానికి 21రోజులకు చేరుకున్నా ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి అవలంభిస్తూ పండగల్లో కూడా అంగన్వాడీ కార్మికుల కుటుంబాలకు మనశ్శాంతి లేకుండా ఇబ్బందులకు గురిచేయడం జగన్మోహన్ రెడ్డికి ప్రభుత్వానికి మంచిది కాదని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నూతన సంవత్సరం సందర్భంగా వేతనాల పెంపు, గ్రాట్యూటీ సీఎం ప్రకటించాలని రాష్ట్రంలోని అంగన్వాడీ అక్కచెల్లెమ్మలు ఎదురుచూస్తున్నారని వారు తెలియజేశారు. లేనిపక్షంలో నూతన సంవత్సరంలో వివిధ రూపాలలో, కలిసివచ్చే సంఘాలన్నింటినీ, ట్రేడ్ యూనియన్లను, పార్టీలను కలుపుకొని సమ్మెను తీవ్రతరం చేస్తామని, 3వ తేదీ రాష్ట్రంలో ఉన్నటువంటి 26 జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముట్టడి, ధర్నాలు నిర్వహించి అక్కడే సాయంత్రం వరకు ఉంటామని హెచ్చరించారు. రాష్ట్రంలోని ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రి, అంగన్వాడీ ఉన్నతాధికారులు, తమ న్యాయమైన ఉద్యమాన్ని ప్రభుత్వానికి, అధికారులకు, ప్రజలకు తెలియజేస్తూ వారధిగా ఉన్నటువంటి పత్రికావిలేకరులు, ప్రింట్, ఎలక్ట్రాన్ మీడియా, ఫోటోగ్రాఫర్లకు అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు మినీ అంగన్వాడి వర్కర్లు 2024 సంవత్సరం నూతన సంవత్సరపు శుభాకాంక్షలు తెలిపారు. అంగన్వాడీల పోరాటానికి ఎస్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్, ధనంజయరెడ్డి సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు, ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు, నగర కార్యదర్శి దాసరి చంద్ర, సిపిఐ నగర కార్యదర్శి విసి గోపీనాథ్ తదితరులు పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు.




చిత్తూరు సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

పలమనేరు: మండలంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సోమవారం 21 రోజూ అంగన్వాడీల సమ్మె కొనసాగింది. ఈసందర్భంగా సిఐటియు నాయకులు గిరిధర్ గుప్తా మాట్లాడుతూ గత 21 రోజులుగా అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కొత్త సంవత్సరంలోనూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ నాయకులు భారతి, శాంతి, లక్ష్మీ, చిలకమ్మ పాల్గొన్నారు.

కార్వేటినగరం: 21వ రోజు అంగన్వాడీలు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద గల వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సిఐటియు కార్యదర్శి మమత, ఏఐటియుసి కార్యదర్శి రాధమ్మలు మాట్లాడుతూ తాము 21రోజులుగా నిరవధిక దీక్షలు చేపడుతున్న ప్రభుత్వం ఎలాంటి హామీలు ఇవ్వలేదని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నెలకు 26వేలు జీతం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్వేటినగరం, వెదురుకుప్పం, శ్రీ రంగరాజపురం మండలాలకు చెందిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తమ డిమాండ్ పరిష్కరించాలని మండల కేంద్రంలోని సచివాలయం ఆవరణలో సోమవారం 21వ రోజు సమ్మెను కొనసాగించారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు శకుంతలమ్మ ఆధ్వర్యంలో ఆటపాటలతో నిరసన తెలిపారు.

కార్వేటినగరంలో..


పలమనేరులో..


ఎన్నికల బరిలో ఉంటా..

డికె ఆదికేశవులు మనవరాలు చైతన్య

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

2024 ఎన్నికల బరిలో తాను ఉంటానని జనసేన పార్టీ నుంచి తాను పోటీ చేయనున్నట్లు మాజీ ఎంపి, డికె ఆదికేశవులు నాయుడు మనవరాలు చైతన్య స్పష్టం చేశారు. సోమవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని తమ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత తనను పోటీ చేయాలని కోరారని, ఎక్కడి నుండి పోటీ అనే అంశం కుటుంబ పెద్దలతో సంప్రదించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. రాజకీయ కుటుంబ నేపథ్యం నుండి వచ్చిన తాను ఎంఎల్ఏగా పోటీ చేయనున్నట్లు చెప్పారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చైతన్య

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు ఆర్థికసాయం



ప్రజాశక్తి- బంగారుపాల్యం: ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు ఆర్థిక సహాయం అందించినట్లు ఉపాధ్యాయసంఘాలు తెలిపాయి. చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సమగ్రశిక్ష సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న నిరవధిక సమ్మె మద్దతుగా మండల విద్యాశాఖ తరపున ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. బంగారుపాళ్యం మండల విద్యాశాఖ సిబ్బంది మాట్లాడుతూ సమగ్రశిక్షణలో విధులు చేపడుతున్న వారు కూడా విద్యాశాఖ కుటుంబ సభ్యులేనని, కావున ప్రభుత్వం వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతు మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. మండల ఉపాధ్యాయ బందం వారు విరాళాల రూపంలో వచ్చిన రూ.18,002ల నగదును మండల విద్యా శాఖాధికారులు నాగేశ్వర రావు, రమేష్ బాబు, ఉపాధ్యాయులు లక్ష్మీపతి, ధనంజయరాజు, మదన్ మోహన్, జగదీష్, చంద్రశేఖర్, భాస్కరయ్య, మోహన్‌రెడ్డి, ఉమా, నాసిర్ బాషాలు సమగ్ర శిక్ష జిల్లా సంఘ నాయకులైన విల్వనాదం, దేవరాజులు, ఢిల్లీ కుమార్, కష్ణమూర్తిలకు అందిచారు.

ఓంశక్తి యాత్రకు ఉచిత బస్సులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిజెఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మెన్ గురజాల జగన్ మోహన్, తండ్రి సంస్థ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు ఆధ్వర్యంలో చిత్తూరు రూరల్ మండలం చెన్నసముద్రం గ్రామం, గుడిపాల మండలం 190 రామాపురం, కోలావూరు, అడవిచేను, గుడిపాల గ్రామాల్లో ఓంశక్తి భక్తుల ఆహ్వానం మేరకు సోమవారం రాత్రి ఓంశక్తి పూజలకు, అన్నదానం కార్యక్రమాలకు హాజరై మహిళా భక్తులుకు ఉచిత చీరలను పంపిణీ చేశారు. మెల్ మరువత్తూరు యాత్రకు జిజెఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల భక్తులకు 8 ఉచిత బస్సు ఏర్పాటు చేసిన యాత్రను ప్రారంభించారు.



ఓం శక్తి భక్తులకు జీజేఎం ట్రస్ట్ వారు ఏర్పాటు చేసిన ఉచిత బస్సులు

ఎన్నికల నామ సంవత్సరం

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్



2024 సంవత్సరానికి రాజకీయ నేతలు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు, డిఆర్ఓ రాజశేఖర్, జిల్లా పరిషత్ సీఈవో ప్రభాకర్‌రెడ్డిని పలువురు ఉద్యోగులు కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జీజేఎం ట్రస్ట్ అధినేత గురజాల జగన్మోహన్ నాయుడు, చిత్తూరు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు, ఏపిఎస్ ఆర్‌టిసి వైఎస్ ఛైర్మెన్ విజయానందరెడ్డి, డిఏ శ్రీనివాస్‌ను వారి నివాసాల వద్ద పలువురు రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలకు అతీతంగా అధికార ప్రతిపక్ష నేతలు, ఒకే పార్టీలోని నాయకులు వర్గవిబేధాలు వీడి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


చిత్తూరు ఎంఎల్ఏకు శుభాకాంక్షలు తెలుపుతున్న విజయానందరెడ్డి

పోలీస్ సిబ్బందితో కలసి ఎస్పీ వేడుకలు

జిల్లా ఎస్పీ వై.రిషాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2024 వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. జిల్లా ఎస్పీ క్యాంపు ఆఫీస్‌లో ఎస్పీ పాల్గొని కేక్ కట్‌చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఏడాదిలో మరింత ఉత్సాహంతో సమిష్టిగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దామని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ క్యాంపు ఆఫీస్, స్పెషల్ బ్రాంచ్, ఏఆర్ అధికారులు, జిల్లా పోలీసు కార్యాలయాలలో పనిచేసే సిబ్బంది, పోలీసు అధికారులు మరియు జిల్లాలోని పలువురు సిఐలు, ఎస్సైలు సబ్ డివిజన్ వారీగా విచ్చేసి ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎల్.సుధాకర్, అడిషనల్ ఎస్‌పి శ్రీలక్ష్మీ, ఏఆర్. అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వర రావు, ఎస్‌బి డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, 3 సబ్‌డివిజన్ పోలీసు అధికారులు, జిల్లాలో గల అందరూ డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.


న్యూ ఇయర్ వేడుకల్లో కేక్‌కట్ చేస్తున్న ఎస్పీ రిషాంత్ రెడ్డి

ఉత్సాహంగా నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు

చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. నగర కమిషనర్ డాక్టర్ అరుణ, నగర పాలక అధికారులతో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు దంపతులకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగరపాలక అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ ఎస్.అముద, ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానంద రెడ్డిలను కలిసి పుష్ప గుచ్ఛాలు అందించి శు భాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డిలు కమిషనర్, మేయర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, సీఎంఎం గోపి, ఏసిపీ రామకష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, మెప్మా, అకౌంట్స్, ప్రజారోగ్య విభాగం అధికారులు, ఉద్యోగులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఇంజనీరింగ్, పారిశుద్ధ్య విభాగం కార్మికులు, సిబ్బంది కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


యుటిఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న జెడ్పి సిఈఒ ప్రభాకర్‌రెడ్డి


డిఆర్‌ఒకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

హెల్త్ మిషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నూతన సంవత్సరం సందర్భంగా చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతీదేవి ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్‌మిషన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. సమాజంలో ప్రజలకు అవసరమైన వివిధ ఆరోగ్య కార్యక్రమాలన్నీ కూడా నేషనల్ హెల్త్‌మిషన్ ద్వారా ఆరోగ్య సేవలు ఇవ్వడం జరుగుతుంది. నూతన సంవత్సరం సందర్భంగా అందరూ స్టాఫ్, ప్రోగ్రాం అధికారులు చేయవలసిన ఆరోగ్య సేవలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా స్టాఫ్ అందరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ వెంకట ప్రసాద్, డాక్టర్ రవిరాజు, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ శిరీష, డాక్టర్ అనిల్, శ్రీనివాసులు, జార్జ్, గుణశేఖర్, జయరాముదు, వాణిశ్రీ పాల్గొన్నారు.


జెడ్పి సీఈఒకు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పి ఉద్యోగులు

మున్సిపల్ కార్మికులకు బెదిరింపులు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: మున్సిపల్ ఎంప్లాయిస్, కార్మికులు సమ్మెలో పట్టుదలగా ఉండడంతో కౌన్సిలర్లు బెదిరింపులు ప్రారంభించారు. వార్డుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి అనారోగ్య వాతావరణం నెలకొందని, స్వచ్ఛాంధ్ర సర్వీసు కింద ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని కార్మికులను హెచ్చరించారు. ఒక్కో కుటుంబం నుంచే ఇద్దరు ముగ్గురు కార్మికులుగా పనిచేస్తున్నారని, సమ్మె అయిన తరువాత వారి అంతు తేలుస్తామని మండిపడ్డారు. ప్రత్యామ్నాయ కార్మికులతో పని చేయించుకుంటామని చెప్పారు. దీంతో సిఐటియు నాయకులు కె.లక్ష్మయ్య మాట్లాడుతూ ఒక్కో కుటుంబంలో ఇద్దరు ముగ్గురు ఉన్నారని, ఇపుడు మాట్లాడటం ఏంటని, పనుల్లో చేర్చుకునేటపుడు లేని అభ్యంతరం ఇపుడు ఎందుకన్నారు. ఒకే కుటుంబంలో ఒకరికి మించి పని చేయకూడదని రాజ్యాంగంలో ఎక్కడ ఉందో తెలియజేయాలన్నారు. చౌకబారు విజ్ఞానంతో కార్మికులను రెచ్చగొట్టరాదని, రోజుకు 1500 ఇచ్చిపోటీ కార్మికులను రంగంలోకి దింపి మధ్యపెట్టి గొడవలకు పురికొల్పవద్దన్నారు. వచ్చే పరిణామాలకు మున్సిపల్ కౌన్సిలర్లు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. పరిపాలకులుగా కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సింది పోయి, న్యాయమైన కోర్కెలను పరిష్కరించకుండా వేధింపులకు పాల్పడటం ఏంటని ప్రశ్నించారు. అధికారులు సమ్మెకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

– గూడూరు టౌన్‌లో సమ్మె ఏడో రోజు యూనియన్ రాష్ట్ర నాయకులు గోపీనాథ్ మాట్లాడుతూ కరోనా కాలంలో 'ఫ్రంట్‌లైన్ వారియర్స్' అని అభినందించారని, ఇపుడు నిరవధిక సమ్మె చేస్తుంటే పట్టించుకోకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. సిఐటియు నాయకులు బివి రమణయ్య, ఎం.సంపూర్ణమ్మ, రాఘవయ్య పాల్గొన్నారు.

నాయుడుపేటలో...


– నాయుడుపేటలో మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ మందిరం వరకూ ర్యాలీగా వచ్చి గాంధీ మహాత్మునికి వినతిపత్రం సమర్పించారు. సిఐటియు నాయకులు చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి నాయుడుపేట మున్సిపల్ అధికారులు పోటీ కార్మికులను విధుల్లోకి దించి చెత్తను తొలగించే క్రమంలో కార్మికులపై దాడులు చేయడం తగదన్నారు. నాయుడుపేట మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జలదంకి కృష్ణారెడ్డి కార్మికులను తొలగిస్తామని చెప్పడం తగదన్నారు. ఒక కార్మికుని తొలగించినా పరిణామాలు వేరేగా ఉంటాయన్నారు. మున్సిపాలిటీలో కాంట్రాక్టర్లు లక్షల రూపాయలు దోచుకుని తింటుంటే కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చడంలో పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు.


శ్రీవారి హుండీ ఆదాయం రూ.100 కోట్లు

ప్రజాశక్తి -తిరుమల



శ్రీవారి హుండీ ఆదాయం గత రెండేళ్లుగా పోటీపడుతోంది. సామాన్యుడి నుంచి సంపన్నుడు వరకూ తిరుమల వెంకన్న హుండీలో కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నాడు. దీంతో తిరుమలేశుని దర్శించుకునే భక్తుల సంఖ్యకు తగ్గట్టుగానే హుండీ ఆదాయం నమోదు అవుతోంది. గత రెండేళ్లుగా ప్రతినెలా హుండీలో సమర్పించే కానుకల ఆదాయం మొత్తం రూ.100 కోట్ల పై మాటగానే ఉంటుంది. 22 నెలలుగా రూ. 100 కోట్లు పైగానే ప్రతినెల హుండీ ఆదాయం టిటిడికి జమ అవుతోంది. ఇప్పటికే రూ 17 వేలకోట్ల కు పైగా వెంకన్న ఖాతాలో బ్యాంకుల్లో డిపాజిట్లు ఉండగా, ఏడుకొండలవాడికి అదే స్థాయిలో కానుకలు సమర్పిస్తున్న భక్తులు తిరుమల వెంకన్న హుండీ ఆదాయాన్ని అంతకంతకు పెంచుతున్నట్లు స్పష్టం అవుతోంది. రోజూ రూ. 3.50 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు వెంకన్న హుండీకి ఆదాయం చేరుకుంటోంది. ఇలా గత డిసెంబర్ నెల రూ.116.70 కోట్ల కానుకలు వెంకన్న హుండీకి చేరింది. డిసెంబర్ నెల 31 రోజుల్లో 9 రోజులు ప్రతిరోజు రూ. 4 కోట్ల కు పైగా ఆదాయం హుండీ కి వచ్చింది. డిసెంబర్ 3, 7, 17, 18, 21, 25, 26, 28, 31 తేదీల్లో రోజూ రూ. 4 కోట్లకు పైగానే ఆదాయం గుడికి చేరింది. ఇక డిసెంబర్ 11 న రూ. 5.28 కోట్లు, వైకుంఠ ఏకాదశి రోజు భక్తులు సమర్పించిన కానుకలు రూ. 5.05 కోట్లు గా డిసెంబర్ నెల 24 ఆదాయం టిటిడి హుండీ కి చేరింది. ఇలా క్షణం పాటు శ్రీవారి దర్శనం లభిస్తే చాలని భావించే భక్తులతో తిరుమల కొండ నిత్యం కిటకిట లాడుతున్నట్లే హుండీలో కానుకలు కూడా అదే రీతిలో సమర్పించే భక్తుల విరాళాల మొత్తాలు తిరుమల వెంకన్న ఆదాయాన్ని పెంచుతున్నాయి.

మిన్నంటిన న్యూ ఇయర్ సంబరాలు



సదుం ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డి, చెవిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి



మాజీ మంత్రి అమరనాథరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వెదురుకుప్పం నేతలు



కాణిపాకం వరసిద్ధి వినాయకుని దర్శన అనంతరం జనసేన నేతలు



కార్వేటినగరం సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ లతబాలాజీ



నగరి సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం రాత్రి నుంచి ఊరూర సంబరాలు అంబరాన్నంటాయి. 2024 ఏడాదికి స్వాగతం పలుకుతూ యువత సందడి చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెబుతూ ఆనందోత్సాహంలో మునిగి తేలారు. వివిధ పార్టీ నాయకులు, జిల్లా నేతలు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం ఉదయం నుంచే ప్రధాన ఆలయాల్లో భక్తుల రద్దీ అధికంగా కనిపించింది.

ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరు పెద్ద ఉప్పరపల్లి, నంజంపేట ప్రాంతాలలో బస్టాండ్ కూడళ్ళలో బాణాసంచా పేల్చి కేకులు కట్ చేసి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకలను జరుపుకున్నారు. ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు.

సదుం: స్థానిక యర్రాతివారిపల్లిలోని అయ్యప్ప స్వామి గుడికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయ ధర్మకర్త మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులుతో కలిసి అయ్యప్ప స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరి: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని ఆదివారం పట్టణ పరిధిలోని ఆలయాలు కళకళలాడాయి. టీటీడీ ఆధీనంలోని కరియమాణిక్య స్వామి ఆలయంలో వేకువజామునుంచే జనం స్వామిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ప్రత్యేకంగా నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలు, అగరవత్తులు విక్రయించారు. మిగిలిన ప్రధాన ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు.

కార్వేటినగరం: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయం, అలాగే బాలాజీ నగర్లో వెలసి ఉన్న శ్రీశిరిడీసాయిబాబా ఆలయంతో పాటు అన్ని ఆలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. ఎంపీపీ లతబాలాజీ దంపతులు స్వామివారి సేవలో పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: న్యూ ఇయర్ సంద్భంగా డిసిసిబి బ్యాంక్ ఛైర్మన్ రెడ్డెమ్మ కృష్ణమూర్తి సోమవారం మంత్రి పెద్దిరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దపంజాణి: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం మండలంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల పరిధిలోని కోగిలేరు సమీపంలోని శ్రీ జలకంటేశ్వర ఆలయం,వీరప్పల్లి సమీపంలోని శ్రీ యోగనందీశ్వరాలయంలో భక్తుల సందడి నెలకొంది.

వెదురుకుప్పం: మాజీ మంత్రి ఎన్.అమరనాథ్‌రెడ్డికి మాజీ ఎంపీటీసీ మోహన్‌మురళి, మునిచంద్రారెడ్డి, సుధాకర్ సోమవారం పలమనేరులోని ఆయన నివాసం వద్ద న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామిని ఆయన నివాసం వద్ద మాజీ ఎంపీటీసీ రోసిరెడ్డి, పద్మనాభరెడ్డిలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఐరాల: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని జనసేన పార్టీ ఉపసర్పంచ్ తిరుమల హరినాథ్, ఏపీ సర్కిల్ విష్ణు కార్ప్ జనరల్ మేనేజరు శేషగిరి రావు, అశోక్, సంతోష్ తదితరులు దర్శించుకున్నారు.

ఎస్ఆర్ పురం: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ఎస్ఆర్‌పురం టీడీపీ నాయకులు మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డిని పలమనేరులో ఆయన నివాసంలో కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపి, గజమాలతో సన్మానించారు. పార్టీ కన్వీనర్ గంధంనేని జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, మాధవ నాయుడు, నిరంజన్, హేమాద్రి యాదవ్, హరి నాయుడు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామికి పలవురు సర్పంచ్‌లు,



ఎస్ఆర్ పురం: డిప్యూటీ సీఎం నారాయణస్వామికి కేక్ తినిపిస్తున్న నేతలు

ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కుప్పయ్య జనార్ధన్, చిట్టి మహేష్, మణి, ముత్యాలు, తయ్యూరు బాబు, హరి రెడ్డి, దిలీప్ రెడ్డి, విజయబాబు, ఎన్ఆర్ఐ భాస్కర్ రెడ్డి, అమృత రాజు, కోటిరెడ్డి బాబు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆభరణం వితరణ



బంగారు ఆభరణాన్ని అందిస్తున్న భక్తులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: శ్రీవేణుగోపాలస్వామి వారికి ఎస్ఆర్ పురం మండలం పుల్లూరు క్రాస్కు చెందిన భక్తులు జయ లక్ష్మి, లోకనాథం దంపతులు సోమవారం నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని స్వామివారికి రూ.30 వేలు విలువజేసే బంగారు ఆభరణాన్ని టీటీడీ ఏఈవో పార్థ సారధి, ఆలయ అధికారి సురేష్‌కుమార్‌కు అందించారు. ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదానం చేపట్టారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పీవీ కండ్రిగ సర్పంచి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు, వైసిపి నియోజకవర్గ మీడియా కో ఆర్డినేటరు యనమల ప్రసాద్ పాల్ తహనగర్ గ్రామ వడ్డెర సోదరుల మధ్య నూతన సంవత్సర వేడుక లు సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పేద మహిళలకు చీరలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు యనమల ప్రసాద్‌పాల్ ముఖ్య అతిథిగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఎస్టీ కాలనీ వాసులకు సర్పంచ్ రోస్ రెడ్డి, నింద్ర సర్పంచ్ బాబురెడ్డి ఆధ్వర్యంలో కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ దుస్తులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో దేవుడిచ్చిన కానుకల్లో కొంతమందికి దుస్తులు ఉచితంగా అందించడం చాలా సంతోషంగా కలిగిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ నెంబర్ అనిల్ కుమార్, మురుగేషన్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నేదురుమల్లికి ఘన సన్మానం

ప్రజాశక్తి- వెంకటగిరి: వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ ఛైర్మన్, వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ని వెంకటగిరి నియోజకవర్గంలోని మండల నాయకులు, కార్యకర్తలు, నేదురుమల్లి అభిమానులు, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు నూతన సంవత్సర సందర్భంగా ఘనంగా సత్కరించారు. వారి చేతుల మీద కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామ్ కుమార్ రెడ్డి వెంకటగిరి నియోజకవర్గంలోని వెంకటగిరి మున్సిపల్ కౌన్సిలర్లకు నాయకులకు, కార్యకర్తలుకు ,నేదురుమల్లి అభిమానులుకు , వైసిపి అభిమానులకు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులకు అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ వెంకటగిరి నియో జకవర్గం లోని ప్రజలందరికీ 2024 లో ఇంటింటా ఆనందాల కలగాలని ప్రజలందరికీ దైవ అనుగ్రహం సంపూర్ణంగా లభించాలని కోరుకుంటున్నానని తెలిపారు.

వ్యాస రచన పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-పాకాల: అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు జిల్లా స్థాయి బహుమ తులు గెలుచుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ బేబీశ్వర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని తిరుపతి జిల్లా స్థాయిలో బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, కామన్ మెన్ ప్రొటెక్షన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహించారని, ఈ జిల్లా స్థాయి పోటీలలో పాకాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సరం బైపిసి విద్యార్థిని మనీషా చంద్రగిరి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిందన్నారు. మధులత విద్యార్థిని జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి కైవసం చేస్తున్నారన్నారు. ఎస్వి యూనివర్సిటీ ఆడిటోరియంలో సీఎంపిఎఫ్ నిర్వాహకులు ఘనంగా నిర్వహించి విజేతలకు జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందించారు. విజేతలను పాకాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బేబీశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

పేదలందరికీ కంటి చికిత్సలు : రోజా



మంత్రి రోజా

ప్రజాశక్తి-నగరి: పేదలందరికీ కంటి వైద్యం అందించడానికి ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు 8 రోజుల పాటు కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మంత్రి ఆర్కేరోజా తెలిపారు. ఆదివారం నేత్రశిబిరంపై ఆమె మాట్లాడుతూ శంకరనేత్రాలయ, రోజాచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో ఆపరేషన్, చికిత్స చేయడం జరుగుతుందన్నారు. కంటిపొర ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్ చేసి, అద్దాలు, మందులు అందించడం జరుగుతుందన్నారు. ఈ సువర్ణ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆపరేషన్ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని తన నివాసం వద్ద నిర్వహించే క్యాంప్‌కు విచ్చేస్తే అత్యాధునిక బస్సుల్లోనే ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన అన్ని సదుపాయాలు ఉంటాయన్నారు. ఆపరేషన్ చేసి కంటివెలుగును ఇవ్వడం జరుగుతుందన్నారు. కంటి చికిత్సకు విచ్చేసే వారు నగరి మున్సిపాలిటీకి చెందిన వారైతే 9030571715 నెంబరుకు, నగరి మండలం వారు 9398520622కు, పుత్తూరు మున్సిపాలిటీ 9493565747కు, పుత్తూరు రూరల్ మండలం 9866 881427కు, విజయపురం మండలం 630589 6004కు, నింద్ర మండలం 98661422 58కు, వడమాలపేట మండ లం 99488 71188కు, సంప్రదించా లని మంత్రి క్యాంప్ కార్యాలయ సిబ్బంది సూచించారు.

వంద శాతం లక్ష్యాలు సాధించాలి: డాక్టర్ చైతన్య



ఆరోగ్య సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న వైద్యాధికారి

ప్రజాశక్తి -దొరవారిసత్రం: 'ప్రతి మనిషిలో మార్పు రావాలని, విధి నిర్వహణలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రభుత్వం మనకు అప్పగించిన పనిలో వంద శాతం లక్ష్యాలు సాధించాలి..' అని వైద్యా ధికారి వి చైతన్య సూచించారు. సోమవారం నూతన సంవత్సర వేడుకను పురస్కరించుకొని ఆరోగ్య సిబ్బంది దొరవారిసత్రం పిహెచ్‌సిలో నూతన సంవత్సర వేడుకను నిర్వహించారు. వైద్యాధికారి సూపరువైజర్లు శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆరోగ్య సిబ్బంది పలు రకాల పండ్లను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గడచిన సంవత్స రంలో జరిగిన విషయాలను పూర్తిగా మరచి పోయి, నూతన ఆలోచనతో, సరికొత్త పని తీరు విధానంలో ముందుకు వెళ్లి ఆరోగ్య సేవలు అందించి ప్రజల మన్ననలతో పాటు, అన్ని కార్యక్రమాలలో వంద శాతం లక్ష్యాలు సాధించేందుకు పనిచేయాలన్నారు. అందరి జీవితాల్లో నూతన సంవత్సరం అద్భుతాలతో పాటు ఆనందంగా సాగిపోవాలని ఆకాం క్షించారు. కేక్ కోసి నూతన సంవత్స ర వేడుక లు జరుపుకున్నారు. ఈ కార్యక్ర మంలో సూపరువైజర్స్, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం, స్టాఫ్‌నర్స్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీ సదస్సును జయప్రదం చేయండి'

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: గుంటూరులో నిర్వహించబోయే పంచాయతీ సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర సర్పంచ్ సంఘ కార్యదర్శి కుప్పల మురళి పిలుపునిస్తూ ప్రకటన విడుదల చేశారు. బుధవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. అన్ని జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరవ్వాలని కోరారు. 16 ప్రధాన డిమాండ్‌ల సాధనకు సంబంధించి ఉద్యమ కార్యచరణను రూపొందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ కృషి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఉపాధ్యాయ సమస్యలపై పోరాడేది యుటిఎఫ్ సంఘం అని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత అన్నారు. సోమవారం మండల విద్యా వనరుల కేంద్రంలో యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మండల అధ్యక్షులు మొగిలయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుటిఎఫ్ సంఘం బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం యుటిఎఫ్ డైరీలు, క్యాలెండర్లను ఎంఈఓలు నాగేశ్వరరావు, రమేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, కోశాధికారి మహేష్, రమేష్, చెంగయ్య, బుగ్గయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ



అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో నాయకులు

ప్రజాశక్తి-నగరి: మండలంలోని కేజీ కుప్పం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు జడ్పీటీసీ సభ్యులు గాంధీ ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం అనుసరించాల్సిన మార్గమన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, విద్యా, ఉద్యోగం, రాజకీయాల్లో పేదలకు ప్రాతినిధ్యం కోసం ఆయన చేసిన సేవలు రాజ్యాంగం ద్వారా పేదలకు కల్పించిన హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో సంఘ జాతీయ ఉపాధ్యక్షులు ఎంకే ప్రకాష్, జాతీయ కార్యదర్శి గోవిందస్వామి, మండల కార్యదర్శి బాలవర్ధి రాజు, సర్పంచ్ మోహన్, మధు సుబ్రహ్మణ్యం, నాగరాజు, రమేష్, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అయ్యప్ప భక్తుడు మృతి

ప్రజాశక్తి- ఏర్పేడు: ఏర్పేడు మండలం ఇసుక తాగేలి గ్రామానికి చెందిన తిరు మన్యం నాధముని రెడ్డి (53) గుండెపోటుకు గురై పంబ నది వద్ద సోమవారం ఉదయం మృతి చెందాడు. ఇసుక తాగేలి నుంచి పదిమంది ట్రైన్లో శబరిమలకు అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లారు. నది వద్ద స్నానం చేసేందుకు బస్సు దిగిన నాధముని రెడ్డిగుండెపోటుతో కుప్పకూలాడు. అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే ముందు ఆయన మృతి చెందడంతో ఆయన మృతదేహానికి స్నేహితులు పంబా నది వద్ద నుంచి ఏర్పేడు మండలం ఇసుక తాగేలికి తీసుకువస్తున్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం రోజు నాధముని రెడ్డి మృతి తో గ్రామంలో విషాద ఛాయలు అల ముకున్నాయి. ఇసుక తాగేలి వైసిపి నాయకులు కందాటి ప్రభాకర్ రెడ్డి, తదితరులు నాధ ముని రెడ్డి కుటుంబ సభ్యులను సుబ్రమణ్యం రెడ్డి పరామర్శించి సంతాపం తెలిపారు.

క్రైం కార్నర్

వేటగాళ్ల ఉచ్చులో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: వేటగాళ్ల ఉచ్చులో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని పెరుమాలపల్లి అటవీ ప్రాంత సమీపంలోని మామిడి తోటలో చోటు చేసుకుంది. సీఐ నాగరాజరావు కథనం మేరకు.. పెరుమాలపల్లి గ్రామానికి చెందిన త్యాగరాజులు (35) ఆదివారం రాత్రి అటవీ ప్రాంతంలోకి వెళ్లగా అక్కడ వేటగాళ్లు పందుల కోసం ఉంచిన ఉరిలో తగులుకొని మృతి చెందాడు. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



త్యాగరాజు మృతదేహం

అమృత భారత్ రైలుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మాల్తాటౌన్ నుండి బెంగుళూరుకు బయలుదేరిన అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైలు సోమవారం గూడూరు రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఈ రైలుకు రైల్వే అధికారులు, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. స్థానిక రైల్వే స్టేషన్‌లలో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు డిఆర్‌యుసిసి సభ్యులు మయూరి శ్యాం యాదవ్, స్టేషన్ మేనేజరు వెంకటేశ్వర రావు, చీఫ్ కమర్షియల్ బుకింగ్ అధికారి ఆరేటి వెంకటేశ్వర రావు, డాక్టర్ సుందర కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్టేషన్ మేనేజరు వెంకటేశ్వర రావు మాట్లా డుతూ వందే భారత్ రైలు లాగే అమృత్ భారత్ రైలును కేంద్ర ప్రభుత్వం ప్రారంభి చిందన్నారు. ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన అంశాలలో ఇవి కూడా ఉన్నా యన్నారు. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు గూడూరులో స్టాపింగ్ ఉందని, ఏయే రోజుల్లో ప్రయాణి కులకు అందుబాటులో ఉంటుందో త్వరలో వివరిస్తామని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలకృష్ణమ నాయుడు, ప్రకాష్ నాయుడు, చెంచురెడ్డి పాల్గొన్నారు.



అమృత భారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న నాయకులు